క్లుప్తంగా

హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు(మెట్రో): సామజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణ, శుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి సాధించాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరు జెడ్పీ కార్యాలయంలో తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జేడీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ అధికారులతో సంక్షేమ పథకాల అమలుపై ఆమె సమీక్షించారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత నియమాలపై అవగహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు అన్నారు. గురువారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, వాహన తనిఖీ అధికారి పి.నరేంద్ర బాబు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి



సదస్సులో మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్ అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి నైపుణ్య అభివృద్ధి అవకాశాలపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన జిల్లా సదస్సులో ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోవాలని సూచించారు. ఒడిదుడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పుడే విజయం సాధ్యమవుతుందని వివరించారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వి.వరలక్ష్మి మాట్లాడుతూ జాబ్ మేళాల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. డీబీఆర్‌సీ డిప్యూటీ డైరెక్టర్ సామ్యూల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ అన్ని నైపుణ్యాలు కలిగిన యువతకే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ జె.రమాదేవి, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆఫీసర్ జి.ప్రవీణ్ కృష్ణ, డీబీఆర్‌సీ సిబ్బంది గోశాల ఝాన్సీ రాణి, బలే సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే!

- వీధుల్లో దుర్గంధం
- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- నగర ప్రజలకు ఇబ్బందులు



చేపల తూము సెంటర్‌లో పేరుకుపోయిన చెత్త



కొత్తపేట మెయిన్ రోడ్డుపై అధ్వానంగా ఉన్న డస్ట్‌బిన్లు



కొత్తపేట గౌరీ దేవి గుడి సెంటర్‌లో చెత్త కుప్ప



గన్‌బజార్‌లోని చెత్తకుప్ప

ఏలూరు (టూటౌన్): ఏలురు నగర వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి దుర్గంధం వెజల్లుతోంది. చెత్తపై వేస్తున్న కొద్దిపాటి పన్నును కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎప్పటికప్పుడు చెత్తను తీసుకెళ్లే క్లాప్ ఆటోలను, సిబ్బందిని తొలగించారు. ఈ నేపథ్యంలో ఆయా మార్గాల్లో చెత్త తీసుకెళ్లే వారు లేక కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోయి ప్రజలు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేక పోవడం వల్ల ఉన్న కొద్దిపాటి సిబ్బందితో క్లీన్ ఏలూరు నగరంగా తీర్చిదిద్దడం కలగానే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది.

ఆటోలు, సిబ్బంది తొలగింపు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటింటి చెత్తను తరలించేందుకు 60 క్లాప్ ఆటోలను వినియోగించేవారు. 60 మంది ఆటో డ్రైవర్లు తెల్లవారేసరికి నగరంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేవారు. ఇంటి యజమానుల నుంచి నామమాత్రపు చెత్త పన్ను వసూలు చేసి, ఆ మొత్తాన్ని క్లాప్ ఆటోలు, సిబ్బందికి వేతనాలుగా చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్లాప్ ఆటోల కాంట్రాక్టర్లు వైఎస్సార్ సీపీకి చెందిన వారిగా భావించి, ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఏలూరు నగరంలో క్లాప్ ఆటోలను రద్దు చేశారు. సిబ్బందిని తొలగించారు.

చెత్త.. ఎప్పుడు తీసుకెళతారో!

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 200 వరకు రెగ్యులర్, 800 మంది వరకు కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరిలో సుమారు 800 మంది మాత్రమే వీధులను శుభ్రం చేసే పనులు చేస్తున్నారు. మిగిలిన వార్ని ఇతర పనులకు వినియోగిస్తున్నారు. ఏలూరు నగర జనాభా విస్తీర్ణం మేరకు కార్పొరేషన్‌లో దాదాపు 1,500 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు అవసరం. ఉన్న కొద్దిపాటి వాహనాలతో డంపింగ్ యార్డుకు చెత్తను రోజు విడిచి రోజు లేదా ఒక్కోసారి వారానికి రెండు సార్లు మాత్రమే తరలించే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రతి వీధిలోనూ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పాలకుల అనాలోచిత చర్య వల్లే ఈ పరిస్థితి నెలకొందంటూ నగర వాసులు విమర్శిస్తున్నారు.

కార్మికుల సంఖ్య పెంచాలి



ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పెరుగుతోన్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి. అప్పుడే నగరంలో చెత్త సమస్య పరిష్కారమవుతుంది. ప్రధాన రహదారులు, అధికారులు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే శుభ్రం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో చెత్త సమస్యను పట్టించుకునే వారు లేరు.

– వైఎస్ కనకారావు, స్థానికుడు, ఏలూరు

ఆటోల రద్దుతో సమస్య



చెత్తను సేకరించే క్లాప్ ఆటోల సేవలను దూరం పెట్టడం, సిబ్బందిని తొలగించడంతో సమస్య ఎక్కువైంది. ఏ రోజు కారోజు చెత్త తరలింపు కార్యక్రమాన్ని గాలికొదిలేశారు. ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోంది. క్లాప్ ఆటోలతోపాటు సిబ్బంది సంఖ్యను పెంచడంతోనే చెత్త సమస్య పరిష్కారమవుతుంది.

– జి.గోపీ, సీఐటీయూ నేత, ఏలూరు

రొయ్యల రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు ధరను తగ్గించడం వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో రూ.45 వేలుగా ఉన్న వనామి రొయ్యల ఫీడ్ ధర నేడు లక్షా ఐదు వేల రూపాయలకు పెరిగిందని తెలిపారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పెరిగిన ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన సీడ్ అందించాలని, ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ధర రూ.1.50 సబ్సిడీ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని రవి కోరారు.

కమనీయం.. వాసుదేవుని కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి 8 గంటలకు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అర్చకులు కందుకూరి వేంకట విజయ కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శనీయం




కవయిత్రి మొల్ల జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కవయిత్రి మొల్ల జీవితాన్ని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ల పల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మొల్లమాంబ జయంతిని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జయప్రకాష్ మాట్లాడుతూ తెలుగులో తొలి కావ్యం రచించిన రచయిత్రి మొల్లమాంబ అని గుర్తు చేశారు. మొల్లమాంబ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజేష్ , నగర ఆర్టీఐ విభాగ అధ్యక్షుడు ఫణి, యూత్ నాయకులు వెంకటేష్, రాష్ట్ర మైనార్టీ నాయకులు గాజుల బాజీ, ట్రేడ్ యూనియన్ విభాగ అధ్యక్షుడు శివ, పార్టీ సీనియర్ నాయకులు మల్లిక్, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జనార్దన స్వామి రథోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం శ్రీ భూ, నీళా సమేత జనార్ధన స్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. నగరంలోని ప్రధాన రహదారుల గుండా స్వామి వారి రథోత్సవం కొనసాగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



జనార్ధనస్వామి



రథం లాగుతున్న భక్తులు

నేడు హోలీ వేడుకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం హోలీ వేడుకలు నిర్వహించనున్నారు. ఇండోర్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం వాకర్స్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు హోలీ, పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఇస్కాన్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటల నుంచి గౌర పూర్ణిమ, హోలీ వేడుకలు నిర్వహించనున్నారు.

మహాలక్ష్మి యాగం

దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి, మహాలక్ష్మి జయంతి సందర్భంగా గురువారం మహాలక్ష్మీ యాగం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం భక్తులచే సామూహికంగా 100 సార్లు శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణ చేయిస్తారు.



మహిళల నృత్యాలు



కోలాటమాడుతున్న చిన్నారులు, మహిళలు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	10, 15
బెండకాయలు	40	కంద	76
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	30
కాకర కాయలు	32	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
కాలీఫ్లవర్	--	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	12
దొండకాయలు	40	తోటకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	35	గోంగూర	07-10
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	52
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.30	19
ఏలూరు - తిరుపతి	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



కార్యక్రమంలో సారాపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి మండలం, నామవారం గ్రామంలో గురువారం నాటు సారా వలన కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలత మాట్లాడుతూ నాటు సారా తయారీ, విక్రయించటం, డ్రగ్స్, గంజాయి రవాణా నేరమన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారి వివరాలు టోల్ ఫ్రీ నంబర్ 14405కు గాని, ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నంబర్ 9440902428 గాని సమాచారం అందిస్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, డీపీఈవో ఎ.ఆవులయ్య, జి.పాండురంగారావు, అజయ్‌కుమార్ సింగ్, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, ఆర్.సత్యవతి, ఎస్సైలు ఆరిఫ్, ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, ఫారెస్ట్ బీట్ అధికారి పి.వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఐద్వా ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మహిళా సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో పలు ఉద్యమాలు, పోరాటాలు చేశామని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.హైమావతి తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా స్థానిక పవర్‌పేటలోని ఐద్వా భవనం వద్ద గురువారం సంఘం జెండాను హైమావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిటీ సభ్యులు ఎ.శ్యామలారాణి, జె.హరీషా దుర్గ మాట్లాడుతూ సంఘం ఏర్పడి 44 సంవత్సరాలయిందని, సంఘం చేసిన అనేక ఉద్యమాల ఫలితంగా పలు మహిళా చట్టాలు అమలులోకి వచ్చాయని చెప్పారు. సనాతన ధర్మం పేరుతో మహిళను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ మద్యం అమ్మడం వల్ల మహిళలు, యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్మార్ట్ ఫోన్లతో చెడు సంస్కృతిని అరికట్టాలని, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా పొదుపు డబ్బును తక్కువ వడ్డీలకు అప్పులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జి.స్పందన, ఎం అరుణ్ కుమారి, లక్ష్మి, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం: మండలంలోని రామన్నగూడెం సమీపంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ అందెల రామిరెడ్డి, గ్రామపెద్ద వేట్ల ముత్యాల రెడ్డి కోరారు. గురువారం ఆ కాలనీలో నిర్వాసితులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నగూడెం సమీపంలో నిర్మించిన ఆర్అండ్ఆర్ కాలనీ నిర్వాసితులకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తాము ఏటపాక మండలం నుంచి బుట్టాయగూడెం మండలం రామన్నగూడెం సమీపంలో నిర్మించిన నిర్వాసిత గ్రామానికి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా రేషన్ కార్డులు ఇక్కడికి బదిలీ చేయలేదన్నారు. దీంతో నెలనెలా సొంత మండలానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని రేషన్ కార్డులను వెంటనే ఇక్కడికి బదిలీ చేయాలని కోరారు. కాలనీలో ఇప్పటి వరకూ నీటిని విడుదల చేయడానికి ఒక వ్యక్తి ఉండేవాడని అతను మార్చి 1వ తేదీ నుంచి రావడం లేదని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

వివాదాస్పదమైన గ్రావెల్ రోడ్డు నిర్మాణం

కొయ్యలగూడెం: పరింపూడి కన్నాయిగూడెం గ్రామాల మధ్య నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు వివాదాస్పదంగా మారింది. దీనికి సంబంధించి అధికారులు, రైతులు చేస్తున్న ప్రకటనలు పొంతన లేని విధంగా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.70 లక్షలతో పరింపూడి నుంచి కన్నాయిగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నారు. సుమారు ఇరవై రోజుల క్రితం పనులను ప్రారంభించారు. అయితే రైతులు నాణ్యత లేని గ్రావెల్‌తో రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. రెండు వారాల క్రితం కన్నాయిగూడెంకి చెందిన రైతులు శుద్ధ మట్టిని గ్రావెల్ రోడ్డు నిర్మాణంలో వాడుతున్నారంటూ ఆందోళన చేసి పనులను అడ్డుకున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల వరకు రోడ్డును నిర్మించారు. మరో కిలోమీటర్ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో అధికారులు, కూటమి నాయకులు తమతో చర్చించి, రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటిస్తామని చెప్పి ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని రైతులు వాపోతున్నారు. ఈ రహదారి నిర్మాణంతో కొయ్యలగూడెం మండలంతో పాటు గోపాలపురం, దేవరపల్లి మండలాలకు చెందిన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని రైతులు కోరుతున్నారు.

నిర్మాణంలో ఉందంటున్న అధికారులు

పరింపూడి, కన్నాయిగూడెం గ్రావెల్ రోడ్డు పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయని, రైతులతో చర్చించి పనులు పునఃప్రారంభించినట్లు పీఆర్ ఏఈ సురేష్ పేర్కొన్నారు. కానీ రైతులు మాత్రం తాము రోడ్డు పనులు అడ్డుకున్నామని పేర్కొనడం గమనార్హం.